ప్రజాశక్తి

శుక్రవారం 8 మార్చి 2024

కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రం లో గిరిజ నేతరులు బుడ్డిగా కొండమ్మ ఇల్లు, షాపులు కూల్చి వేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజనుల చేస్తున్న రిలే దీక్షలు గురువారం కొనసాగాయి. ఆదివాసీ గిరిజనులు మాట్లాడుతూ, మండల కేంద్రంలో ఆదివాసి గిరిజనుల చిన్న బడ్డీ, పునాది వేస్తే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించి హోటల్, రెండు షాపులను గిరిజనేతరులు కట్టినా పట్టించుకోలేదన్నారు.గిరిజనేతరులకు సహకరిస్తున్న ఆర్డఓ, వీఆర్వోలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు కిల్లో రామారావు, కుడేలి సూకర్ర, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ రాజు, నాయకులు కొర్ర ఆనంద్, కొండబాబు, బాలన్న పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న గిరిజనులు

బంద్‌ను జయప్రదం చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-పెదబయలు:గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీఓ 3కు చట్టబద్ధతకు ఆర్డినెన్స్, ఆదివాసులకు 100 శాతం ఉద్యోగాలని ఈనెల 10న చేపడుతున్న మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,జిసీసీ అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఆదివాసీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టలను రద్దు చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ కార్యదర్శి కె.శర్భన్న, అధ్యక్షులు బి.గంగాధర్, నాయకులు కె,.బుజ్జిబాబు. కె.నీలకంఠం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

అరకులోయ రూరల్:జిఓ 3 పునరుద్దరణ చేసి ఆదివాసీ ప్రాంతంలో 100శాత ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ఆదివాసీ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 100శాతం ఉద్యోగ అవకాశాలు ఆదివాసులకు ఇవ్వాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి ధనుంజయ్, గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు సింహాచలం, యుటిఎఫ్ మండల కార్యదర్శి విజయ్ కుమార్, సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి మత్స్యరాజు, మాతృ బహుభాష ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు నాగేంద్ర, డిగ్రీ కాలేజ్ ఫ్యాకల్టీ లెక్చరర్ల సంఘం నాయకులు డాక్టర్ సుభాన్, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్సి సాధన కమిటీ కోకన్వీనర్ ఉపేంద్ర,ఆదివాసీ కాఫీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ జి చిన్న బాబు మాట్లడుతూ, ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు గిరిజనేతరులకు కల్పించడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు జగన్నాథం, కోగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఐసుబాబు, డిఎల్ఓ జిల్లా నాయకులు కొర్ర ప్రసన్నకుమార్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు పి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

10న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలి

సీలేరు : జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకు కేటాయించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఈనెల 10న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గాలికొండ ఎంపీటీసీ ఎ.బుజ్జిబాబు పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం గాలికొండలో గురువారం బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజలతో సమావేశాలు నిర్వహించారు.

బంద్‌పై డిపో హెచ్‌సికి వినతి

పాడేరు:ఈనెల 10న జరిగే బందుకు సహకరించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, జిల్లా నాయకులు వంతల దాసు కోరారు. ఈ మేరకు గురువారం పాడేరు ఆర్టీసీ డిపో హెచ్‌సి డి.శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్

మహిళా సాధికారతకు పెద్దపీట

-కలెక్టర్ విజయ సునీత

-వైఎస్ఆర్ చేయూత నిధులు జమ

ప్రజాశక్తి-పాడేరు:మహిళలకు అండగా నిలుస్తూ, వారిని ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. వై.ఎస్.ఆర్.చేయూత నాల్గవ విడత కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ గ్రామంలో ప్రారంభించారు. జిల్లాలో కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో భాగంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత, గ్రామీణభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. మురళి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైఎస్ఆర్. చేయూత పథకం నాల్గవ విడత కింద 53,735 మంది లబ్దిదారుల ఖాతాల్లో రూ.100.75 కోట్లను జమ చేయడం జరుగు తుందన్నారు. మహిళలకు ఇటువంటి కార్యక్రమాలు అమలు చేయడంతో సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ పథకం స్వయం సహాయక సంఘాలలోని పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి వి.మురళి, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాడేరు: మహిళలందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పిలుపునిచ్చారు. గురువారం చేయూత కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరైన మహిళలకు ఓటు వినియోగంపై కలెక్టర్ అవగాహన కల్పించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ఇ.వి.ఎం. యూనిట్లు, వివి పేట్‌ల పనితీరును మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలూ తీసుకు న్నామన్నారు. ఓటర్లందరూ సహకరించి అత్యధిక శాతం ఓటింగ్‌లో పాల్గొనేలా చైతన్యవంతులు కావాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి వి.మురళి, ప్రత్యేక ఉప కలెక్టర్ వివిఎస్ శర్మ, ఇతర అధికారులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

సర్పంచులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి -చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలోని 66 గ్రామ పంచాయతీల సర్పంచులకు, కార్యదర్శులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌పై చింతూరు ఐటిడిఎ కార్యాలయం గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ రకాల అవసరాలను తెలియజేశారు. డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్ గ్రామపంచాయతీ పరిపాలన, నిధుల వినియోగం, ఆదాయం సమకూర్చుకోవడం వంటి అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఇంటి పన్నులు వసూలు వంద శాతం చేయడంలో సర్పంచులు పూర్తి సహకారం అందించాలని కోరారు. 100శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన పంచాయతీ సర్పంచులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక అందిస్తామన్నారు.

25 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చింతూరు : ఆటోలో తరలిస్తున్న రూ.25 లక్షలు విలువైన 25 కేజీల గంజాయిని చింతూరు మండలం, చట్టి జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని తూలుగొండ గ్రామానికి చెందిన కర్ణం రామాంజనేయులు ఆటోలో 25 కేజీల గంజాయిని భద్రాచలం తరలిస్తుండగా చట్టి జంక్షన్ వద్ద చింతూరు ఎస్సై డి.శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. రామాంజనేయులును అదుపులోకి తీసుకొని విచారించగా... ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కొర్మానూరు గ్రామానికి చెందిన తాతారావు వద్ద నుండి 25 కేజీల గంజాయిని సీలేరు పరిధిలోని వలసగడ్డ గ్రామానికి చెందిన కిలో మహేష్ కొనుగోలు చేసి, తూలుకొండకు చెందిన అంజి అనే వ్యక్తికి విక్రయించాడు. ఈ గంజాయిని భద్రాచలం వరకు తీసుకెళ్లి ఖమ్మంకు చెందిన సుభాన్ అనే వ్యక్తికి అప్పగించడానికి రామాంజనేయులు ఒప్పందం కుదుర్చుకొని తీసుకెళ్తున్నట్లు విచారణ తేలింది. ఈ కేసులో మొత్తం నలుగురుపై కేసు నమోదు చేశారు. రామాంజనేయులును అరెస్ట్ చేశారు. మిగిలిన ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

గిరిజనులకు ఆఫ్‌లైన్ ద్వారా బియ్యం పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి ఎ.దారకొండ గ్రామంలోని రేషన్‌కార్డుదారులకు అధికారులు ఆఫ్‌లైన్ ద్వారా బియ్యం పంపిణీ చేయాలని గాలికొండ ఎంపిటిసి సభ్యులు అపరంజి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సచివాలయం ఎదుట లబ్ధిదారులు భారీ ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ రహదారి సౌకర్యం లేకపోవడంతో ఎండియులు ఇంటింటికి వచ్చి బియ్యం సరఫరా చేయలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. దీనికి తోడు నెట్‌వర్క్ కూడా లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఆన్‌లైన్ ద్వారా కాకుండా ఆఫ్‌లైన్ ద్వారా లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ నుండి నీటి విడుదల

ప్రజాశక్తి -సీలేరు : డొంకరాయి పవర్ కెనాల్‌కు చేపట్టిన అత్యవసరం మరమ్మతు పనులు బుధవారం రాత్రికి పూర్తి కావడంతో గురువారం ఉదయం 6.15 గంటలకు ఆ కెనాల్ నుంచి నీటి విడుదల చేసినట్లు ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వలు అధికంగా ఉండడంతో ఫిబ్రవరి 10 నుంచి డొంకాయి పవర్ కెనాల్ నుంచి నీటిని నిలిపివేశామని తెలిపారు. ఈ క్రమంలోనే పవర్ కెనాల్ మరమ్మతు పనులు చేశామన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి అరకులోయ రూరల్:భవన నిర్మాణ కార్మికశాఖ సంక్షేమ బోర్డును కొనసాగించాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం అరకువేలి తహసిల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు.అనంతరం మండల తహసిల్దార్ కు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, మైదాన ప్రాంతం నుంచి మేస్త్రిలు, తాపీ మేస్త్రిలను తీసుకొచ్చి పనులు ఇవ్వడంతో స్థానికులకు పని లేకుండా పోతుందని, దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడవలసిన పరిస్థితి వస్తుందని తెలిపారు. బయట నుంచి వచ్చే మేస్త్రులను తాపీ మేస్త్రీలను అరికట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం టెండర్ ద్వారా వచ్చిన పనులు కూడా కాంట్రాక్టర్లు బయట నుండి కూలీలని తీసుకొచ్చి చేయించడంతో స్థానికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. స్థానికంగా ఉంటున్న భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నుండి రావలసిన సంక్షేమ పథకాలు 1214 మెమో ద్వారా నిలిపివేసిందని విమర్శించారు. చట్ట విరుద్ధంగా 2500 కోట్లు వెల్ఫేర్ బోర్డు నుండి రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు గెమ్మిలి రామచంద్రరావు, కార్యదర్శి సింహాచలం, సోమ నాయుడు, సత్తిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు, కార్మికులు

ప్రజా సేవలో కృష్ణకుమారి

-స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాలు

- పలు అవార్డులు కైవశం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: తన తోటి గిరిజనులకు తన వంతు ఎంతో కొంత సహాయం చేయాలన్న లక్ష్యంతో తనకు వచ్చే వేతనం నుంచి ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద గిరిజనులకు పలు సేవా కార్యక్రమాలను మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ విభాగ అధ్యక్షురాలు కే కృష్ణకుమారి అందిస్తున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన విపత్కర సమయంలో నుంచి ఆమె సుమారు ఐదేళ్ల పాటు ఇప్పటి వరకు సేవ కార్యక్రమాలను చేపడుతున్నారు. లాక్‌డౌన్ వంటి భయంకరమైన సమయంలో బయటకు వెళ్లడానికి భయపడుతున్న సమయంలో ఆమె గిరిజనులకు కరోనా వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. తన వేతనం నుంచి వచ్చిన సొంత నిధులతో పాటు తనకు పరిచయస్తులైన తన తోటి స్నేహితుల దగ్గర నుంచి నిధులను సేకరించి గ్రామాల్లో శానిటైజర్లు, సబ్బులు, మాస్క్ లను పంపిణీ చేశారు. దీంతోపాటు గర్భిణీలు, రక్తహీనతతో బాధ పడుతున్న వారికి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకుంటే ఎటువంటి ఉపయోగంపై అవగాహన పరచడంతో పాటు ఆమె కూడా తన సొంత నిధులతో కొంత పౌష్టికాహార సరుకులను పంపిణీ చేశారు. నిరుపేద గిరిజన మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేయడంతో పాటు చలి తీవ్రతను తట్టుకోవడానికి రగ్గులు, దుప్పట్లను కూడా అందజేస్తున్నారు.దిశ చట్టంపై గ్రామాల్లో మహిళలకు, పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులను చైతన్య పరిచారు. ఎపిడమిక్ సీజన్లో జ్వరాలతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులను పరామర్శించి బియ్యం, పప్పు తో పాటు ఇతర నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు గ్రామాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై గిరిజనులకు అవగాహన కల్పించారు.

చిన్నారులకు భోజనం పెడుతున్న కృష్ణకుమారి

సేవలకు అవార్డులు: సేవా దృక్పథంతో కృష్ణకుమారి చేస్తున్న సేవలను గుర్తించి 2023 రిపబ్లిక్ డే నాడు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఆమెకు ఉత్తమ సేవ అవార్డును రాష్ట్ర మంత్రి అమర్నాథ్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు. అరకులోయ నిర్మల కాన్వెంట్ మిషనరీ, మండల ఎంఈఓ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పలు సంఘాల ఆధ్వర్యంలో ఆమెకు అవార్డులు అందజేశారు. ఆమె మరింత స్ఫూర్తితో ఉత్సాహంగా సేవా కార్యక్రమాలను కొనసా గిస్తుండటంతో పలువురు గిరిజనులు అభినందిస్తున్నారు.

సరుకులు ఇస్తున్న కృష్ణకుమారి (ఫైల్ ఫొటో)

ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎంను గెలిపించాలి

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-ఎటపాక : పోలవరం నిర్వాసితులు, గిరిజనులు, ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎంకి మద్దతు తెలిపి రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని తోటపల్లిలో ఆటిశెట్టి రాము అధ్యక్షతన గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీతారాం మాట్లాడారు. నిర్వాసితుల సమస్యలు, పోడు భూముల సమస్యలు, గిరిజన, రైతు సమస్యలపై సిపిఎం పార్టీ అనేక పోరాటాలు చేసిందని, జీవో నెంబర్ 3 రద్దుకు వ్యతిరేకంగా ప్రజా, న్యాయపోరాటం చేసిందని గుర్తు చేశారు. బిజెపి, టిడిపి, వైసిపిలు నిర్వాసితులు, ఆదివాసీల సమస్యలపైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఆ పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. నిర్వాసితుల పక్షాన నికరంగా నిలబడి పోరాడుతున్న సిపిఎంను రంపచోడవరం నియోజకవర్గం నుండి గెలిపించి అసెంబ్లీకి పంపించాల్సిన అవసరం నేడు ఎంతో ఉందని చెప్పారు. ఈ నెల 9న నిరుద్యోగులు చేపట్టిన ఐటిడిఎ ముట్టడికి, 10న ఆదివాసీ గిరిజన సంఘాలు నిర్వహించే మన్యం బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవి, నాయకులు సొందే రామారావు, ఐ.పద్మ, సోయం వీరమ్మ, పొడియం రత్తమ్మ, జి హుస్సేన్, సవలం రాము పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి ఎర్రజెండాతోనే సాధ్యం

నినాదాలు చేస్తున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చింతూరు : ఏజెన్సీలో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, ఆదివాసీల అభివృద్ధి ఎర్రజెండాతోనే సాధ్యమని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ అన్నారు. మండలంలోని పేగ పంచాయతీ పరిధి ఆముదాలపాడు గ్రామ పెద్దలు సోయం ఎడమయ్య, పొడియం భద్రయ్య,

ఆముదాలపాడులో 25 కుటుంబాలు సిపిఎంలో చేరిక

పొడియం ముఖేష్ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన 25 కుటుంబాలు గురువారం సిపిఎంలో చేరాయి. సిపిఎం మండల నాయకులు వేక రాజ్ కుమార్, మొట్టమ రాజయ్య వారికి కండువాలు వేసి పార్టీకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రజల సమస్యలను గాలికొదిలేశాయని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో భద్రాచలం నియోజకవర్గంలో సిపిఎం ప్రజా ప్రతినిధులు చేసిన అభివృద్ధే తప్ప, ఈ పదేళ్లలో ఏ అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. బిజెపి, వైసిపి, టిడిపిలు ఏజెన్సీ ప్రాంతానికి చేసింది ఏమీ లేదన్నారు. పాలకుల మాటలు నమ్మి మోసపోవద్దని, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజానీకం అంతా సిపిఎంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు సోడా కోసయ్య, ఉదయం అన్నయ్య, కొవసి సంతోష్, సోడి నాగమ్మ, సాయం రాములమ్మ, రవ్వ మల్లమ్మ, కొవసి సన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సిపిఎం నాయకుడు మృతి

పార్టీ నేతల ఘన నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామానికి చెందిన సిపిఎం శాఖ కార్యదర్శి మోసం లక్ష్మయ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు లక్ష్మయ్య భౌతికాయంపై గురువారం సిపిఎం మండల నాయకులు పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ లక్ష్మయ్య సిపిఎం తరుపున రెండుసార్లు పంచాయతీ వార్డు మెంబర్‌గా గెలిచారన్నారు. పార్టీ, ప్రజల పట్ల అంకితభావం కలిన లక్ష్మయ్య మృతి చాలా బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సున్నం దూలయ్య, సభ్యులు కారం కృష్ణమూర్తి, నరసయ్య, పండా వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ, సున్నం పార్వతి, సున్నం నాగయ్య, భద్రాచలం నియోజవర్గ కన్వీనర్ కారం పుల్లయ్య, యుటిఎఫ్ నాయకులు సోడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్మయ్య మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగే విధంగా వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం హాలులో ప్రతిష్టమైన భద్రతతో స్ట్రాంగ్ రూము భద్రపర్చినట్లు చెప్పారు. ఎన్నికలు అనంతరం ఈవీఎంలను అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని తలారి సింగ్ సిఎహెచ్ కాలేజీకి తరలించడం జరుగుతుందని, అక్కడే కౌంటింగ్ ఉంటుందని చెప్పారు. ఫిబ్రవరి 29 నుండి మార్చి 6 తారీకు వరకు ఫారం-6 213, ఫారం-7 94, ఫారం-8 207 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, యస్.బొజ్జిరెడ్డి, సిద్ధ వెంకన్నబాబు, యం.వాణిశ్రీ, లోత రామారావు, తాసిల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, డిప్యూటీ తాసిల్దార్ యస్‌వివి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ్, ఇందిరా బాయ్, మణికంఠ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- మోతుగూడెం : చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అన్నారు. వై.రామవరం మండలం బొడ్డగండి గ్రామపంచాయతీ పరిధి గంగవాడ, శాంతినగర్ గ్రామాల్లో గురువారం గిరిజనులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత క్రీడలపై దృష్టి పెడితే చెడు అలవాట్లకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. గంజాయి సాగు చేయటం, అమ్మడం, కొనడం, రవాణా చేయడం నేరమన్నారు.

పాత్రికేయుని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కొయ్యూరు : కొయ్యూరు మండలం, నడింపాలెం గ్రామానికి చెందిన ఆంధ్ర వాయిస్ విలేకరి పాలపర్తి సత్యనారాయణ సతీమణి దేవి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి శివ ప్రసాద్ దంపతులు గురువారం సత్యనారాయణ ఇంటికి వెళ్లి దేవిని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఆర్ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, నాయకులు కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని ములకనపల్లి, పెదమట్టపల్లి, రేఖపల్లి పంచాయితీల పరిధిలోని గ్రామాలలో రూ.68 లక్షలు మండల పరిషత్తు, ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో అంతర్గత సిసి రోడ్లు నిర్మాణానికి ఎంపిపి కారం లక్ష్మి, రామవరం, పెద్దమట్టపల్లి రేఖపల్లి, ములకంపల్లి సర్పంచ్‌లు కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి పూనెం సరోజినీ, సవలం గురువారం శంకుస్థాపన చేశారు. ముల్కనపల్లిలో రూ.10 లక్షలు, తమ్మాయిపేటలో రూ.10 లక్షలు, గుర్రంపేటలో రూ.15 లక్షలు, రేకపల్లిలో రూ.33 లక్షలతో ఈ పనులు చేస్తున్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నుండి విడుదలైన ఎంపీపీ నిధులు రూ.15 లక్షల్లో రేఖపల్లిలో రూ.5 లక్షలు, రాజుపేటలో రూ.5 లక్షలు, పెదమట్టపల్లిలో రూ.5 లక్షలతో సిసి రోడ్లు నిర్మాణం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్ ఫణీంద్ర రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు రమేష్, పంకు సత్తిబాబు, తాతబాబు, సత్యనారాయణ, జి లక్ష్మణ్ బాబు, తుర్రం బాబురావు, హజరత్, వీర్ల నాగేశ్వరరావు, సోడి మల్లయ్య, సచివాలయం సిబ్బంది తరుణ్ పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజా ప్రతినిధులు

రజక కాలనీలో కుళాయి ప్రారంభం

కుళాయి ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ పశ్చిమ నియోజకవర్గం 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ రజక కాలనీలో ప్రజల దాహార్తి సమస్య పరిష్కారమైంది. ఇక్కడ నివసిస్తున్న సుమారు 100 కుటుంబాలకు నిరంతరం తాగునీటి సరఫరాకు కుళాయిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా నీటి సమస్య పరిష్కారానికి సహకరించిన నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని, ప్రజలు నీటిని వృథా చేయవద్దని సూచించారు.

అనాథ మహిళకు అండ

అనాథ మహిళకు సాయం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి -తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని ఒక ప్రైవేటు నర్సింగ్‌హోం వద్ద రోడ్డు పక్కన ఉన్న అనాథ మహిళకు పలువురు అండగా నిలిచారు. జివిఎంసి ఒకటో వార్డు అధ్యక్షుడు టి.సూరిబాబు మధ్యాహ్న భోజనం అందించగా, అభి కన్‌స్ట్రక్షన్స్ అధినేత బి.శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా వాకింగ్ స్టిక్స్, దుస్తులు, నిత్యావసర వస్తువులను అందజేశారు. సాయం చేసిన వారిలో టిడిపి నేత డి.వెంకటేష్, మరికొందరు ఉన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -సీతమ్మధార జివిఎంసి 53వ వార్డు శివనగర్ యుపిహెచ్‌సిలో గురువారం నిర్వహించిన ఆరోగ్యసురక్ష వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. జివిఎంసి ఐదో జోన్ ఎంహెచ్ఒ డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొని పర్యవేక్షించారు. యుపిహెచ్‌సి డాక్టర్ అంజలి నేతృత్వంలో వైద్యాధికారులు పాల్గొని 300 మందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు కార్యక్రమంలో సిబ్బంది మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ మధు, స్టాఫ్ నర్సులు ఆశ, కోమలి, సూపర్వైజర్ కె వెంకటలక్ష్మి, ఇంచార్జ్ శివాజీ పాల్గొన్నారు.

సిబ్బంది, రోగుల అవస్థలు

ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ఆరుబయటనే నిర్వహించడంతో సరియైన ఫ్యాన్లు, మౌలిక సదుపాయాలు లేక ఎండ తీవ్రతకు రోగులతో పాటు సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు ఏర్పాట్లు కల్పనలో విఫలమయ్యారు.

కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి డుంబ్రిగుడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మాత వందన ఆయుష్మాన్ భారత్ యోజన పథకంపై గిరిజనులకు అవగాహన పరచాలని బిజెపి మండల అధ్యక్షుడు కె రమేష్ చెప్పారు. గురువారం పీఎస్సీలోని వైద్య సిబ్బందితో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గర్భిణీలకు మాత వందన పథకం ద్వారా పలు రకాల సేవలను అందిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా గిరిజనులందరికి ఉచితంగా వైద్య సేవలను అందిస్తుందని చెప్పారు. వీటిపై గిరిజనులకు అవగాహన లేక ఉపయోగించుకోవడంలేదని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు వీటిపై గిరిజనులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వి బలరాం కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎం. విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఐటిడిఎ పిఒ

సూచనలు చేస్తున్నఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి అనంతగిరి:మండలంలోని పోలింగ్ బూత్‌లను గురువారం పాడేరు ఐటిడిఎ పిఒ వి అభిషేక్ పరిశీలించారు. ఎగువ శోభ పంచాయతీ పరిధి బీసుపురం, ఎగువశోభ, టోకూరు పంచాయతీ ములియాగూడ, శివలింగపురం, డముకు, కాశీపట్నంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లకు, సిబ్బందికు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని బూతు లెవెల్ బిఎల్‌ఒలకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి బాలాజీ పాల్గొన్నారు

అప్పలస్వామికి కన్నీటి వీడ్కోలు

● సిపిఎం నేత తియ్యాల పార్థివదేహానికి పలువురి ఘననివాళి

నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు, ఇతర నేతలు, ప్రజలు

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 62వ వార్డు, దుర్గానగర్ సిపిఎం శాఖ పూర్వ కార్యదర్శి, సీనియర్ సభ్యులు తియ్యాల అప్పలస్వామికి గురువారం వందలాది మంది అంతిమ కన్నీటి వీడ్కోలు పలికారు గతనెల 20న తీవ్ర బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన .అప్పలస్వామి, నాటి నుంచి కోమాలోనే విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను బతికించేందుకు ఆపరేషన్, ఇతర చికిత్సలు చేసినా వైద్యానికి శరీరం సహకరించడం లేదని వైద్యులు నిర్ధారించిన తర్వాత గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. తెచ్చిన రెండు గంటల్లోనే అప్పలస్వామి తుదిశ్వాస విడిచారు. అప్పలస్వామి భౌతిక కాయంపై సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు, పార్టీ సీనియర్ నేత యువిఎస్ఎన్ వర్మ పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

అప్పలస్వామికి కన్నీటితో తుదివీడ్కోలు పలుకుతున్న మహిళలు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1985 నుంచి తుదిశ్వాస విడిచే వరకు ప్రజల, పార్టీ, మల్కాపురం జోన్, దుర్గానగర్ వాసుల కోసమే సిపిఎం జెండా నీడన నిజాయితీ గల కార్యకర్తగా అప్పలస్వామి పనిచేశారని కొని యాడారు. ఆయన మరణం కుటుంబసభ్యులకే కాకుండా, పార్టీకి, ప్రజాఉద్యమాలకు తీరని లోటన్నారు. అప్పలస్వామి లేకపోయినా, అతని ఆశయాలను కొనసాగించడమే అతనికిచ్చే ఘననివాళి అన్నారు. సంతాప కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా నేత రొంగలి రాము, పార్టీ మల్కాపురం జోన్ నేత కె.నూక రాజు, ఆర్ లక్ష్మణమూర్తి, ఎల్ కృష్ణ, ఎ.సత్యారావు, వి బాబూరావు, పి సురేష్, ఎస్ అర్జునరావు, ఎం నీలకంఠం, కె.రాము, మహిళా సంఘం నాయకులు ఆర్. విమల, పి వర లక్ష్మి, బి రాజేశ్వరి, పి పుణ్యవతి, ఎం జయలక్ష్మి, జి రామలక్ష్మి, కె అన్నపూర్ణ, గ్రామ సంఘాల నాయకులు కె.పరదేశి నాయుడు, ఎంఎల్ నాయుడు, ఎం మాలినాయుడు, మల్లేశ్వర రావు, అప్పలస్వామి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, దుర్గానగర్ వాసులు వందలాదిగా తరలివచ్చి, అప్పలస్వామి భౌతికకాయంపై పూలు జల్లి ఘనంగా కన్నీటి వీడ్కోలు పలికారు. దుర్గానగర్ నుండి కోరమండల గేటు వద్ద గల శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర జరిగింది. అప్పలస్వామికి ఆయన పెద్దల్లుడు గణేష్ తలకొరివి పెట్టారు. బతికున్నప్పుడు ఆయన కోరుకున్న విధంగా సిపిఎం విధానాలకు అనుగుణంగా అప్పల స్వామికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

అప్పలస్వామి జీవిత విషయాలు

విజయనగరం జిల్లా తెర్లాం మండలం కూనాయివలసకు చెందిన అప్పలస్వామి విశాఖలోని ఆంధ్ర స్టీల్ కార్పొరేషన్ ఫ్యాబ్రికేషన్ డిపార్ట్‌మెంట్‌లో 1980 నుంచి పనిచేశారు. ఇక్కడే సిఐటియుతో బంధం ఏర్పడింది. తరువాత షిప్‌యార్డ్ ఒపిఎఫ్‌లో గ్యాస్ కట్టర్‌గా, వివిధ పరిశ్రమలలో పని చేసారు. తర్వాత ఎపిఎస్ఆర్‌టిసి కండక్టర్‌గా ఉద్యోగం చేశారు.

ఉద్యమ నేపథ్యం: దుర్గానగర్ యువజన సంఘం వ్యవస్థాపకునిగా, సిపిఎం శాఖ కార్యదర్శిగా, భవన నిర్మాణ కార్మిక సంఘం బాధ్యునిగా, ఆర్‌టిసి ఉద్యోగుల సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ బాధ్యునిగా, ప్రజానాట్యమండలి కళాకారునిగా, దుర్గానగర్ గ్రామ సంఘం బాధ్యునిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు.

కుటుంబం : అప్పలస్వామి భార్య టి అసిరమ్మ మహిళా సంఘం కార్యకర్త. పెద్ద కుమార్తె సంతోషి ఎఎన్ఎం. పెద్దల్లుడు గణేష్ హెచ్‌పిసిఎల్‌లో పనిచేస్తున్నారు. చిన్న కుమార్తె చైతన్య సెకండరీ గ్రేడ్ టీచరుకాగా, చిన్నల్లుడు శ్రీకాంత్ పోలీస్ ఉద్యోగి.

అన్నసమారాధన

ప్రజాశక్తి- ఆనందపురం: మండలం సిర్లపాలెంలో షిర్డీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం క్షీరాభిషేకం, విశేష అర్చన, హోమం ఇతర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1500 మందికి అన్నదానం నిర్వహించారు. సాయింత్రం గ్రామ ప్రధానవీధుల్లో సాయిబాబా పల్లకిలో ఊరేగింపు ఉత్సవం, దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోరాడ సత్యారావు, బొప్పడాపు గణేష్, బొప్పడాపు వెంకటరమణ, రమేష్, చందక లక్ష్మణరావు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లతో సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆధ్వర్యంలో 42,49వార్డుల పోలింగ్ బూత్ ఏజెంట్లుతో గురువారం సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలనిరాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు అల్లు శంకరరావు, ఆళ్ళ లీలావతి, శ్రీనివాస్, జెసిఎస్ కన్వీనర్లు బగాతి విజయ్, బులుసు జగదీష్, నీలి రవి పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని కొత్తపాకల గ్రామ సమీపంలో ఫిబ్రవరి 27న జరిగిన హత్య కేసును రంపచోడవరం పోలీసులు ఛేదించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో కేసు వివరాలను సిఐ వెంకటేశ్వరరావు వెల్లడించారు. సిఐ కథనం ప్రకారం... మండలంలోని కొత్తపాకల గ్రామ సమీపంలో వాగు వద్ద బిల్లా ఆదిలక్ష్మి (31) మృతదేహం ఉందని ఫిబ్రవరి 27న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పలు విషయాలు వెల్లడయ్యాయి. మృతురాలు బిర్లా ఆదిలక్ష్మి, నిందితుడు కొండపల్లి రమణబాబు ఇద్దరూ రాజమండ్రి సమీపంలోని రాయుడుపాకల అట్టల తయారీ ఫ్యాక్టరీలో కూలి పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉండేవారు. ఆదిలక్ష్మి భర్త ఏడాది క్రితం మృతి చెందాడు. దీంతో కొండపల్లి రమణబాబు, ఆదిలక్ష్మి కొద్దిరోజులుగా సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదిలక్ష్మి గర్భం దాల్చింది. ఫిబ్రవరి 25వ తేదీన ఆదిలక్ష్మితో కలిసి రమణబాబు మడిచర్ల గ్రామానికి వెళ్లి, అక్కడ నుండి 27న రంపచోడవరం వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో మార్గం మధ్యలో ఆదిలక్ష్మికి గర్భం తీయించేందుకు డబ్బులు అడగ్గా రమణబాబు నిరాకరించాడు. దీంతో ఇరువురి మధ్య తగాదా జరిగింది. ఈ క్రమంలో ఆదిలక్ష్మిని కొత్తపాకల సమీపంలోని కాలువ వద్ద రాయికి తలను కొట్టి హత్య చేశాడు. కేసును ఛేదించిన పోలీసులు నిందితుడు రమణబాబును ఈ నెల 6న అదుపులోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఎస్సై మోహన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

1450 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-ఆనందపురం: క్యాబ్‌లో అక్రమంగా తరలిస్తున్న 1450 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎఎస్ఐ చలం తెలిపారు. బుధవారం రాత్రి భీమిలి క్రాస్ రోడ్డు చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా, ఆరిలోవ నుంచి పెద్దిపాలెం రైస్ మిల్లుకు వ్యానులో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. భీమిలి క్రాస్ రోడ్డు చెక్‌పోస్ట్ సిబ్బంది వ్యాను ఆపే ప్రయత్నం చేయగా, వ్యాన్ ఆపకుండా పారిపోయేందుకు యత్నించగా, చెక్‌పోస్టు సిబ్బంది వెంబడించి పట్టుకున్నారన్నారు. వ్యాన్‌ను తనిఖీ చేయగా 1450కిలోల రేషన్ బియ్యం పట్టుబడింది. వ్యాను ఓనర్ అప్పలరాజు, పైలా వాసులను అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు

వాహనాల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- మధురవాడ : వాహనాల చోరీకి పాల్పడిన పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం పాలెం క్రైం ఎస్ఐ రంభ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం కొమ్మాది కూడలి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, పాత మధురవాడ మెట్ట ప్రాంతానికి చెందిన టేకుపూడి కనకరాజు బైక్‌ను ఆపి, వాహనపత్రాలు అడగగా, అతని వద్ద లేకపోవడంతో, అదుపులోకి తీసుకొని విచారించారు. మధురవాడ టైలర్స్ కాలనీలో దొంగిలించినట్లు బైక్‌గా గుర్తించారు. ఈ సందర్భంగా మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆటో, ఎంవిపి పోలీస్‌స్టేషన్, నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రెండు బైక్‌లను చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని,నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

వాలంటీర్లకు పురస్కారాలిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సిఎం జగన్, వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్లే సంక్షేమ వారధులని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గురువారం జివిఎంసి ఐదోజోన్ షాదీఖానా కల్యాణ మండపంలో 26, 42, 43, 44వార్డుల వాలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేసి, అభినందించి సత్కరించారు. కోవిడ్ వ్యాప్తి సమయంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది అందించిన సేవలు మరువలేనివన్నారు కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఆళ్ళ లీలావతి శ్రీనివాస్, పి.ఉషశ్రీ, జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ, ఎపిడి పద్మావతి, దుర్గప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, నాయకులు రేవతిరావు, హబీబ్, బొడేటి కిరణ్, అంబటి శైలేష్, రవిబాబు, పాండవ శ్రీను, అమ్మాజీ పాల్గొన్నారు.

46వ వార్డులో....

వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా జివిఎంసి 46వ వార్డు మధురానగర్, కస్తూరినగర్, శాంతినగర్, సంజీవయ్య కాలనీలో విధులు నిర్వహిస్తున్న 105 మంది సేవా పురస్కార గ్రహీతలకు జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ గురువారం సత్కరించారు జివిఎంసి కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఎపిడి పద్మావతి, సిఒ వరలక్ష్మి, బివి నారాయణరెడ్డి, లావణ్య, రమణ పాల్గొన్నారు.

చదువుతోనే మహిళల రాణింపు

ఎయు బోటనీ విభాగం చైర్మన్ సంధ్యదీపిక

ప్రజాశక్తి- విశాఖపట్నం : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఎయు బోటనీ విభాగం చైర్మన్, ప్రొఫెసర్ కె.సంధ్యదీపిక అన్నారు మహిళా దినోత్సవ సందర్భంగా గురువారం ప్రజాశక్తితో మాట్లాడుతూ, పదేళ్లుగా ఎయులో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ, ఈనెల 2న బోటనీ విభాగం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానన్నారు. చదువు ద్వారానే ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా , మధ్యతరగతి కుటుంబాల్లోని ఆడపిల్లలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో బాగా చదువుకుని ఉన్నతంగా రాణించవచ్చన్నారు. ఆడపిల్లలకు చదువుతోపాటు మంచి నడవడిక,సంస్కారాన్ని ప్రతి తల్లిదండ్రులూ నేర్పితే మంచిదని అభిప్రాయపడ్డారు.

'రెగ్యులర్' ఉత్తర్వులపై యుఎంహెచ్ఇయు హర్షం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వైసిపి ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది అయిన స్త్రీ, పురుష ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ గురువారం జిఒ ఎంఎస్ నెంబరు 30, 31 ద్వారా ఆదేశాలు ఇవ్వడం పట్ల యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.జగన్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వాలతో 23 సంవత్సరాలుగా పోరాడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రెగ్యులర్ చేస్తూ జిఒలు ఇచ్చిందని పేర్కొన్నారు. మొదటి విడతగా ఇచ్చిన జాబితాలో చిన్న చిన్న కారణాల చేత లేని వారిని కూడా సత్వరమే చేర్చి రెగ్యులర్ చేసేందుకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అంతవరకూ వారికి సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా భవిష్యత్తు పోరాటాలు చేపడతామన్నారు.

24 అసెంబ్లీ, 5 ఎంపీ సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వెలమలకు 5 పార్లమెంటు, 24 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రెడ్డి దామోదరరావు తెలిపారు. గురువారం వేదిక ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలన్నారు. సమావేశంలో బార్ కౌన్సిల్ సీనియర్ మెంబర్ సిరిపురపు కృష్ణమోహన్, డాక్టర్ బొకం దేముడు, జాగారపు రామునాయుడు, వెన్నెల సూర్యనారాయణ, సిరికి పోతురాజు పాల్గొన్నారు.

బిసిలకు రుణాల పేరిట వైసిపి మోసం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐదేళ్ల పాలనలో బిసిలకు వైసిపి నయా పైసా రుణ సౌకర్యం కల్పించలేదని టిడిపి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ బిసిలకు వైసిపి ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలు చేసిందన్నారు.

తీరంలో ఏర్పాట్ల తీరును అడిగి తెలుసుకుంటున్న సిపి రవిశంకర్

మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా శివరాత్రి సందర్భంగా తీర ప్రాంతాలకు వచ్చే భక్తుల కోసం జరుగుతున్న ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం పరిశీలించారు. ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి, యారాడ, అప్పికొండల్లో ఆయన పర్యటించారు.

రియల్ మి 12 సిరీస్ 5జి ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ ఫోన్ ప్రొవైడర్ రియల్ మికి సంబంధించిన 12 సిరీస్ 5జిని ఆవిష్కరించినట్లు సంస్థ మీడియా టెక్ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ అనుజ్ సిద్ధార్థ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

తూర్పు నియోజకవర్గం ఎన్నికల అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖ తూర్పు శాసనసభ నియోజకవర్గం ఎన్నికల అధికారులుతో జిల్లా జాయింట్ కలెక్టరు కె.మయూర్ అశోక్ గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వహించాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అడ్డతీగలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయినిలు

ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాగరతీర కళంజియా సమాఖ్య, ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలను చిన వాల్తేరు రజక వీధి సామాజిక భవనంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాఖ్య కో-ఆర్డినేటర్ ధనలక్ష్మి మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీ ఎంవివిని సత్కరించారు. సభ్యులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, జెసిఐ స్త్రీ సంకల్ప నుంచి హెన్నా, అడ్వకేట్ అరుణ, రత్న సమాఖ్య లీడర్స్ దివ్య, పాపమ్మ, సత్య, గోవింద లక్ష్మి, పుష్ప, పూర్ణ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోప్యాయులు లక్ష్మీబాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 11వ వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు ఆటపాటలు నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీబాయిని శాలువతో ఘనంగా సత్కరించారు. గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

మాడుగుల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ సివిఎస్ఎస్ శాస్త్రి పలువురు మహిళలను సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినా అఘాయిత్యాలు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సులోచన, పైడిరాజు, జువాలజీ లెక్చరర్ డాక్టర్ షర్మిలశ్రీ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత మహిళలు అన్ని రంగాలలో అత్యున్నత స్థానాల్లో నిలిచి తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. అనంతరం కళాశాల మహిళా విభాగాధిపతులను సన్మానించారు. మహిళా సిబ్బందికి బహుమతులను అందజేశారు. విద్యార్థినులు మహిళా దినోత్సవం పలు నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పునస్కరించుకొని తుమ్మపాల శారదా వేలి డెవలప్మెంట్ సమితి ప్రాంగణంలో కార్యదర్శి కర్రి జోగినాయుడు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ నరేష్ మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో మహిళలు మహా శక్తులుగా అన్ని రంగాలలో తమ ప్రతిభతో రాణిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలకు అవసరమయ్యే రుణాలను మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంస పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సోషల్ వర్కర్ లావణ్య, లుపిన్ కంపెనీ మేనేజ్ వెంకట్, దిశ పోలీస్ స్టేషన్ యస్ఐ రాములమ్మ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎన్.భాను, డాక్టర్ భాషిణి ప్రియాంక జ్యోతిప్రజ్వళన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్. డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్,పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ పి.ప్రసాద్, ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.డయానా పాల్గొన్నారు.

పాడేరు: ఒడిదుడుకులను ఎదుర్కొగిలిగే శక్తిమంతులు స్త్రీమూర్తులు అని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత కొనియాడారు. గురువారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలో పాల్గొన్న కలెక్టర్ ప్రసంగించారు. మహిళలు జీవతంలో అనుకున్నది సాధించాలని సూచించారు. సహనమే స్త్రీ మూర్తికి బలమని, వారు శ్రమతో దేన్నైనా సాధించగలరని వివరించారు.

పాడేరులో కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మహిళల ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని సూచించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లను మహిళలు సత్కరించారు.ఈ కార్యక్రమంలో మినుములూరు సర్పంచ్ చిట్టెమ్మ, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటిలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండెంట్ హర్షిత రాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఇంజనీరింగ్ కంపెనీల లోనే కాకుండా ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ తదితర ప్రభుత్వ రంగాలలో మహిళలకు అపార అవకాశాలు వున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ జె .రాజమురుగదాస్, మహిళా సాధికార విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్షితరాజును ఘనంగా సత్కరించారు.

అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

డుంబ్రిగుడ: స్థానిక యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో గురువారం మహిళ దినోత్సవాన్ని ఘనంగా ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు యుటిఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ఎస్ కన్నయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజారావు, ఎస్.బాలకృష్ణ పాల్గొన్నారు.

అడ్డతీగల : మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిమతి అన్నారు. యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతి కార్యక్రమాలు, ఆట పాటలు, క్యాట్ వాక్‌తో అలరించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె శ్రీనివాస్, తేజరావు, నాగప్రసాద్, రవణమ్మ, కమల, రత్నం, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హర్షిత రాజు